పరిశ్రమల పతాక.. గాజువాక

- క్యూ కట్టినట్లుగా పరిశ్రమల వరుస
- తలసరి ఆదాయంలో రాష్ట్రంలోనే ప్రథమం

గాజువాక ప్రాంతం పారిశ్రామికంగా దినదిన ప్రవర్ధమానంగా విరాజిల్లుతోంది. అభివృద్ధి కళ్లకు కట్టినట్లు దర్శనమిస్తుంది. షిప్‌యార్డ్ మొదలుకుని నేవల్ డాక్‌యార్డ్, విశాఖ పోర్ట్ ట్రస్టు, హెచ్‌పీసీఎల్, కోరమాండల్ కర్మాగారాలు ఒక క్యూలో నిల్చొని ఉన్నట్టు కనిపిస్తాయి. ఓ వైపు గంగవరం పోర్టు, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, ఏపీ మెడ్‌టెక్ పార్కు పక్కపక్కనే ఉన్నట్లు అగుపిస్తాయి. అక్కడి నుంచి కాస్త ముందుకు వెళ్తే హిందూజా పవర్ ప్రాజెక్టు, దానికి పడమర భాగంలో ఎన్‌టీపీసీ, మరికొద్ది దూరంలో అచ్యుతాపురం సెజ్ క్యూలైన్‌లో ఉన్నట్టుగా కనిపిస్తాయి. అక్కడి నుంచి ముందుకొస్తే ఫార్మా పరిశ్రమలు, వాటికి మరికొంత దూరంలో దువ్వాడ ఎస్‌ఈజెడ్, దానికి సమీపంలో గాజువాక, పెదగంట్యాడ ఆటోనగర్ పరిశ్రమలు స్వాగతం పలుకుతాయి..


వైజాగ్ స్టీల్‌ప్లాంట్


గాజువాక ఆటోనగర్‌లో పరిశ్రమలు


వీఎస్ఈజెడ్ పరిపాలనా భవనం

గాజువాక : దేశానికి స్వాతంత్య్రం వచ్చిన సమయంలో ఎవరికీ తెలియని గాజువాక నేడు జిల్లాలోనే పారిశ్రామిక కేంద్రంగా భాసిల్లుతోంది. దేశంలో పారిశ్రామికాభివృద్ధికి వేసిన ప్రణాళికలు అమల్లోకి రావడంతో విశాఖకు సంబంధించి అత్యధిక పరిశ్రమలు గాజువాక ప్రాంతంలోనే ఏర్పాటై, త్వరితగతిన అభివృద్ధి చెందింది. రైలు, రోడ్డు, జల, విమాన సర్వీసులకు అతి చేరువలో ఉండటంతో గాజువాక వ్యాపార కేంద్రంగానూ ప్రసిద్ధి చెందింది. అనేక వ్యాపార, పరిశ్రమ, అనుబంధ సంస్థలు ఇక్కడే ఉన్నందువల్ల జిల్లాలోనే ప్రధాన వాణిజ్య కేంద్రంగా కూడా వినుతికెక్కింది. తలసరి ఆదాయంలో రూ.2.64 లక్షలతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండటం విశేషం.

దినదినాభివృద్ధి

షిప్‌యార్డ్ ఆవిర్భావంతో ప్రారంభమైన గాజువాక ప్రాంత అభివృద్ధి బీహెచ్‌పీవీ ఏర్పాటుతో వేగవంతమైంది. అనంతర కాలంలో జింక్, హెచ్‌పీసీఎల్, స్టీల్ ప్లాంట్ వంటి భారీ ప్రభుత్వరంగ పరిశ్రమలు రావడంతో గాజువాక స్వరూపమే మారిపోయింది. భారీ పరిశ్రమలకు అనుబంధ పరిశ్రమలు ఏర్పడడంతో ఆటోనగర్ ఆవిర్భవించింది. దీంతో గాజువాక పట్టణం ఊహించనంత వేగంగా అభివృద్ధి చెందింది.

అనుబంధ పరిశ్రమలన్నీ ఆటోనగర్‌లోనే..

బీహెచ్‌పీవీని ఆధారంగా చేసుకొని ఆటోనగర్ ఏర్పడినా, స్టీల్‌ప్లాంట్ వంటి పరిశ్రమలకు కూడా అనుబంధ పరిశ్రమలు ఆటోనగర్‌లోనే నెలకొన్నాయి. ఇక్కడ చిన్న, పెద్ద యూనిట్లు కలుపుకొని సుమారు 800దాకా పరిశ్రమలున్నాయి. స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డు, ఎన్టీపీసీ, ఎస్సార్, హెచ్‌పీసీఎల్‌తో పాటు వివిధ పరిశ్రమలకు అవసరమైన బోల్టులు, నట్లు, ఇతర పరికరాలు తయారు చేయడంతో పాటు ఇంజినీరింగ్, ఫ్యాబ్రికేషన్ వర్క్స్, మార్బుల్, రబ్బర్, వెల్డింగ్ ఇనిస్టిట్యూట్‌లు, ఇతర ప్రాసెస్, కాస్టిఐరన్ యూనిట్లు, ఐస్ తయారీ నుంచి రొట్టెలు, సేమ్యా, గ్లాస్ కార్వింగ్, ఐస్‌క్రీమ్, ప్లైవుడ్, పైపులకు సంబంధించిన ఉత్పత్తులను తయారు చేస్తాయి. ఏడాదికి రూ.40కోట్ల పైచిలుకు ఆర్డర్లు అందిపుచ్చుకుంటున్నాయి.

వేలాది మందికి ఉపాధి

ఉత్తరాంధ్ర జిల్లాల్లో నీటిపారుదల వసతులు పెద్దగా లేకపోవడం, వ్యవసాయం భారమవడం తదితర కారణాల వల్ల ఆ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు గాజువాక ప్రాంతానికి వలస రావడం ఆరంభించారు. వీరిలో కొందరికీ భారీ పరిశ్రమలు, వాటి అనుబంధ పరిశ్రమల్లో ఉపాధి లభించింది. పారిశ్రామికీకరణతో పట్టణాభివృద్ధి పెద్ద ఎత్తున జరిగింది. జనాభా పెరిగింది. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా భవన నిర్మాణం, షాపులు, మార్కెట్లు, ట్రాన్స్‌పోర్టు, వ్యాపార సంస్థలు, ఇంకా పలు ఇతర రంగాల్లో మరికొందరికి ఉపాధి అవకాశాలు లభించాయి. దీంతో ఇక్కడ విద్యా సంస్థలు కూడా పెద్ద సంఖ్యలో ఏర్పాటయ్యాయి. ఆ తరువాత కాలంలో ప్రభుత్వాలు పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియను సులభతరం చేయడంతో దువ్వాడ వీఎస్ఈజెడ్ ఏర్పాటైంది. అందులో పలు పరిశ్రమలు ఏర్పాటు కావడం, ఆ తరువాత కాలంలో వడ్లపూడిలో అపెరల్ పార్కు ఆవిర్భావంతో వేలాదిమందికి ఉపాధి లభించింది.

ప్రతిష్ఠాత్మక పరిశ్రమలెన్నో..

గాజువాకకు సమీపంలోని లంకెలపాలెంలో ఫార్మా పరిశ్రమలు, పాలవలస కేంద్రంగా హిందూజా పవర్ ప్రాజెక్టు, వాడ చీపురుపల్లి వద్ద ఎన్‌టీపీసీ వంటి ప్రతిష్ఠాత్మక పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఇక్కడి పరిశ్రమల్లో మొత్తం లక్షన్నర మంది ప్రత్యక్షంగా పని చేస్తుండగా, పరోక్షంగా మరో లక్ష కుటుంబాలు ఆధారపడి ఉన్నట్టు అంచనా.

పారిశ్రామిక ప్రాంతంగా ఖ్యాతినార్జించిన గాజువాక కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే వారికి ఎల్లప్పుడూ సాదరంగా ఆహ్వానం పలుకుతూనే ఉంటుంది.

రాజమహేంద్రవరం వెళ్లి పెన్షన్ అందజేత


శాంతమ్మకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ ధనలక్ష్మి

పెదగంట్యాడ: వలంటీర్ విధి నిర్వహణలో శభాష్ అనిపించుకుంది. తన క్లస్టర్ పరిధికి చెందిన ఓ వృద్ధురాలు ఊరు వెళ్లడంతో, అక్కడికి వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేశారు. వివరాలివి.. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నీలాపువీధిలో కె.శాంతమ్మ (79) నివాసం ఉంటున్నారు. ఆమెకు ప్రతి నెలా వలంటీర్ ధనలక్ష్మి పెన్షన్ అందజేస్తున్నారు. అయితే శాంతమ్మ ఇటీవల రాజమహేంద్రవరం సమీపంలోని పిడుంగొయ్యి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఆమె అక్కడి నుంచి సమయానికి రాలేకపోవడంతో, వలంటీర్ అక్కడికి వెళ్లి ఆమెకు పెన్షన్ అందజేశారు. దీంతో లబ్ధిదారు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

ద్విచక్ర వాహనాల వేలం నేడు

మల్కాపురం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) మురళీనగర్ వద్ద ఉన్న గోపాలపట్నం సర్కిల్–4లో ఈ నెల 4న ద్విచక్ర వాహనాల వేలం వేయనున్నట్టు సెబ్ సీఐ సీహెచ్‌వీఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలోని సెబ్ స్టేషన్‌లో ఉదయం 11 గంటలకు వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాల వేలంపాట ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని ఆయన కోరారు.

క్లుప్తంగా

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత


ఫారెస్ట్ గార్డ్ పట్టా సూర్యనారాయణను సత్కరిస్తున్న ప్రజా సంఘాలు

అగనంపూడి: వన్యప్రాణులు అంతరించిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అగనంపూడికి చెందిన ప్రజాసంఘాల నాయకులు పి.పూర్ణచంద్రరావు, ఎస్.సన్యాసిరావు, బి.సత్యనారాయణ అన్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అటవీశాఖలో 42 సంవత్సరాలు విధులు నిర్వహించి, పదవీ విరమణ పొందిన పట్టా సూర్యనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో కె.ముత్యాలు, కె.వి.సత్యనారాయణ, కె.పద్మావతి, విందుల వరహాలు, కె.గురుమూర్తి, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

‘ఆహారపు అలవాట్ల వల్లే ఊబకాయం’


డా. చలపతిరావు

అక్కిరెడ్డిపాలెం: పిల్లల ఆహారపు అలవాట్ల వల్లే ఊబకాయం వస్తుందని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ చలపతిరావు ఆచంట అన్నారు. మార్చి 4న అంతర్జాతీయ ఊబకాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దాదాపు 14.4 మిలియన్ల స్థూలకాయ పిల్లలతో భారతదేశం ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. పిల్లల్లో శారీరక శ్రమ లేకపోవడం, ఆటలకు దూరంగా ఉండటం, కేలరీలు, కొవ్వు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం, శరీరంలో అధిక కొవ్వు పేరుకుపోవడం ఊబకాయానికి ప్రధాన కారణాలని చెప్పారు. టీవీ చూస్తూ భోజనం చేయడం, టిఫిన్ మానేయడం, చక్కెర తీపి పానీయాలు తీసుకోవడం, తరచూ బయట పదార్థాలు తినడం, జంక్ ఫుడ్, క్యాలరీలు అధికంగా ఉండే పదార్థాలు తినడం వల్ల ఒబేసిటీ వస్తుందని చెప్పారు. పోషకాహారం తీసుకోవడం, ప్రతీ రోజు వ్యాయామం చేయడం, ఆటలాడటం, టీవీ తక్కువగా చూడటం వల్ల ఊబకాయానికి చెక్ పెట్టవచ్చని వివరించారు.

రక్షణగిరిలో ప్రత్యేక ప్రార్థనలు


శిలువ మార్గాన్ని చూపిస్తున్న ఫాదర్

కంచరపాలెం: క్రీస్తునందు భయభక్తులు కలిగి జీవనం సాగించాలని జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం ఫాదర్ ఆనంద్ అన్నారు. పాస్కా కాలాన్ని పురస్కరించుకుని శుక్రవారం పునీత పేతురు దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ ప్రకాష్ నేతృత్వంలో రక్షణగిరి పుణ్యక్షేత్రం వరకు ఘనంగా పరిశుద్ధ శిలువ మార్గం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ ఆనంద్ మాట్లాడుతూ క్రీస్తునందు భయభక్తులు కలిగి ఉండడం ద్వారా ముక్తి లభిస్తుందన్నారు. అదే జ్ఞానానికి మూలమని పరిశుద్ధ బైబిల్ గ్రంథంలో సూచించారన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం


అమ్మవారిని క్షీరంతో అభిషేకిస్తున్న దృశ్యం

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేక సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ సేవలో 20 మంది ఉభయదాతలు పాల్గొన్నారు.

డ్రై డే పాటిస్తే వ్యాధులు దూరం


ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: వారంలో ఒకరోజు డ్రై డే పాటించడం వల్ల దోమల నివారణతో పాటు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని గాజువాక ఏఎంవో సత్యనారాయణ అన్నారు. 69వ వార్డు హరిజన జగ్గయ్యపాలెంలో ఫ్రై డే – డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను వారంలో ఒక్కరోజైనా తొలగించాలన్నారు. ఫ్రిజ్ వెనుక భాగంలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు, కుండలు, తొట్టెలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. రుబ్బురోళ్లలో నీటిని తొలగించి డ్రై గా ఉండేలా చూడాలన్నారు. పరిసరాలన్నీ పొడిగా, పరిశుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ మురళీ కృష్ణ, కృష్ణారావు, అప్పలరాజు, ఏఎన్‌ఎం సుధ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

750వ రోజుకు ఉక్కు దీక్షలు


750వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 750వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు కూర్చుని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని వెనక్కి తీసుకునే వరకు వివిధ రీతుల్లో ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వరంగ సంస్థల జోలికి వస్తే కార్మికులు చూస్తూ ఊరుకోరన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాలను మార్చుకోవాలని హెచ్చరించారు.

ప్రమాదకరంగా మలుపులు


ఆటోనగర్ డి - బ్లాక్ చుక్కవానిపాలెం నిర్వాసిత కాలనీకి వెళ్లే మార్గంలో మలుపు


మింది నుంచి జింక్ రోడ్డుకు వెళ్లే మార్గంలో జెడ్పీ హైస్కూల్ వద్ద ..

అక్కిరెడ్డిపాలెం: ప్రమాదకర మలుపులు ప్రయాణికులను గాయాలపాలు చేస్తున్నాయి. ఆటోనగర్ బీ బ్లాక్ నుంచి ఎఫ్ బ్లాక్‌కు వెళ్లే మార్గంలో చుక్కవానిపాలెం నిర్వాసిత కాలనీ రోడ్డులో మలుపు వద్ద అడపాదడపా ప్రమాదాలు సంభవిస్తూనే ఉంటున్నాయి. ఇక్కడ మలుపు ఉందని హెచ్చరిక బోర్డు లేకపోవడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మింది నుంచి జింక్ వెళ్లే మార్గంలో జిల్లా పరిషత్ పాఠశాల ఎదురుగా గల మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న వాహనచోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. అధికారులు స్పందించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వైరల్ జ్వరాల కట్టడికి చర్యలు

- జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర
- తానాం గురుకుల పాఠశాల సందర్శన


గ్రామ పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర

పరవాడ: వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి, జ్వరాలను అరికట్టడానికి తక్షణ చర్యలు చేపట్టాలని అనకాపల్లి జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర స్థానిక వైద్యాధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం తానాం రెసిడెన్సియల్ పాఠశాలను సందర్శించి వైరల్ జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన మందులు అందించి జ్వరాలు తగ్గు ముఖం పట్టే విధంగా చూడాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో కాలువలు, చెత్తా చెదారాల తొలగించడానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మురుగు కాలువలు, అపరిశుభ్ర ప్రదేశాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో దోమల నివారణ కోసం మందులు పిచికారీ చేయించాలన్నారు. విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారులకు వరహాలుదొర సూచించారు. ఆయన వెంట తానాం సర్పంచ్ కన్నూరిదేవి వెంకటరమణ, పరవాడ ప్రభుత్వ వైద్యాధికారి ఐ.ఆర్.రంజిత్, మలేరియా సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం ముమ్మరం


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


ఓటర్లకు కరపత్రాలను అందిస్తున్న బీజేపీ నాయకులు


72వ వార్డులో ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపించడంతో ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆయా పార్టీల నాయకులు పట్టభద్రులను అభ్యర్థించారు.

- వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు 72వ వార్డులో ప్రచారం నిర్వహించారు. పార్టీ వార్డు ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో చైతన్యనగర్‌లో ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు రాజాన వెంకటరావు, ఉరుకూటి అప్పారావు, ధనలక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రచార రథం ప్రారంభం

బీజేపీ మద్దతు అభ్యర్థిగా పోటీ చేస్తున్న పీవీఎన్ మాధవ్ కోసం ఆ పార్టీ నాయకులు సిద్ధం చేసిన ప్రచార రథాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర శ్రామికనగర్‌లోని ఎన్నికల ప్రచార కార్యాలయం వద్ద శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు నిర్మల కిశోర్, కోడూరు లక్ష్మీనారాయణ, దేనంకొండ కృష్ణంరాజు, రోహిణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

76వ వార్డులో..

పెదగంట్యాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని చినకోరాడ, బాలచెరువు తదితర ప్రాంతాల్లో శుక్రవారం జోరుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలోపి. ప్రమీల, నరసింహమూర్తి, కాకినాడ పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

64వ వార్డులో..

వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని గంగవరం, జాలరిపల్లిపాలెంలో జోరుగా ప్రచారం చేశారు. పట్టభద్రులను కలిసి, తొలి ప్రాధాన్య ఓటును వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు వేయాలని అభ్యర్థించారు.

87వ వార్డులో..

కూర్మన్నపాలెం: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి 87వ వార్డు నాయకులుతో కలిసి ప్రచారం చేపట్టారు. కణితి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని ఉపాధ్యాయులను కలిసి ఓటు వేయాలని కోరారు.

బీజేపీ ప్రచారం

బీజేపీ బలపరిచిన అభ్యర్థి పీవీఎస్ మాధవ్‌కు మద్దతుగా వడ్లపూడి మండల అధ్యక్షురాలు బొండా శ్రీదేవి ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం రావుల చెరువు వాకర్స్‌పార్కు, షిర్డీ సాయి మందిరం, భరత్‌నగర్ రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు పాల్గొని ఓటర్లుకు కరపత్రాలను అందజేశారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి

- వైభవంగా నారసింహుడికి ఆర్జిత సేవలు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు


నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


సింహగిరిపై కోలాటం ఆడుతున్న మహిళలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. దీంతో కొండపై ఆధ్యాత్మిక భావం ఉప్పొంగింది. ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠంపజేసి 108 స్వర్ణ తులసీ దళాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. అర్చకుడు అప్పాజీ తదితరులు పూజ నిర్వహించగా ఆలయ ఇన్‌స్పెక్టర్ సిరిపురపు కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయం.. కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ అలంకారి పురోహిత్ కరి సీతారామాచార్యులు తదితరులు ఈసేవనిర్వహించారు.

▸ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ కల్యాణ మండపంలో పండితులు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు.

విశేషంగా తిరువీధి

ఏకాదశిని పురస్కరిచుకుని సింహగిరిపై తిరువీధి విశేషంగా జరిగింది. మదనగోపాలస్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి పల్లకిలో అధిష్ఠంపజేసి సాయంత్రం సింహగిరి మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

టెన్త్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంతోష్

కంచరపాలెం: పదో తరగతి విద్యార్థులు నిపుణులను కలవడం, స్వల్ప, దీర్ఘకాలిక కోర్సులు అభ్యసించడం, వాస్తవ స్థితిగతులను తెలుసుకోవడం ద్వారానే కెరీర్‌ను ఎంచుకోవచ్చని ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ పుల్లేటికుర్తి సంతోష్ అన్నారు. చైల్డ్ రైట్స్ అండ్ యూ, ధరణి సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టెన్త్ తరువాత విభిన్న అవకాశాలు, సాంకేతిక అవకాశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పెద్దాడ వెంకటేశ్వరరావు, ధరణి సంస్థ కార్యదర్శి బి.హరి పాల్గొన్నారు.

బాలికల సంరక్షణపై అవగాహన ర్యాలీ

మహారాణిపేట: బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహారాణిపేట వద్ద మొదలైన ఈ ర్యాలీ జబ్బర్‌తోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు జరిగింది. ఈ నెల 1న మొదలై 8వ తేదీ వరకు జరగనున్న కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేశారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమనే అంశంపై స్థానికులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక శాఖాధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ సమత, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.